దోచేస్తున్న దళారులు

- ధాన్యం తూకంలో మోసాలు
- ప్రారంభం కాని సేకరణ కేంద్రాలు
- నష్టపోతున్న రైతన్నలు

అమదాలవలస నియోజకవర్గంలో వరి పంట సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం
సరుబుజ్జిలి	12,245
ఆమదాలవలస	28,345
బూర్జ	27,645
పొందూరు	34,224


ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

ఈ ఏడాది ధాన్యానికి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర ఇలా..

రకం	క్వింటా	80 కిలోలు	40 కిలోలు
గ్రేడ్-ఏ	రూ.2,320	రూ.1,856	రూ.928
కామన్ గ్రేడ్	రూ.2,300	రూ.1,840	రూ.920

సరుబుజ్జిలి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలుకావడంతో రైతన్నలు తీవ్రనష్టాలు చవిచూస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోవడంతో దళారులు రంగప్రవేశం చేశారు. వారికి నచ్చిన రేటుకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో 1,02,459 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంట సాగుచేశారు.

3 నుంచి 5 కేజీలు అధికంగా తూకం..

రైతుల వద్ద ధాన్యం వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. కంప్యూటర్ కాటాలను ముందుగానే వారికి అనుకూలంగా సంబంధిత సాంకేతిక నిపుణుల ద్వారా సర్దుబాటు చేయించుకొంటున్నారు. ఈ విధంగా రైతులకు తెలియకుండా 3 నుంచి 5 కేజీలు నొక్కేస్తున్నారు. తూనికలు, కొలతల అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడం వలన వ్యాపారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా, మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది.

ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు...

నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల్లో నేటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అధికారకంగా ప్రారంభించలేదు. దీనివలన ధాన్యాన్ని యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టిన రైతులు నిల్వ చేయలేక దళారులు అడిగినంత రేట్లకు ఇచ్చి మద్దతు ధరను కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించాం. ప్రభుత్వం మంజూరు చేసిన కేంద్రాలను ప్రారంభానికి త్వరలోనే చర్యలు తీసుకొంటాం. తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటాం.

– ఎస్. సత్యనారాయణ, సివిల్ సప్లయ్ డీటీ, సరుబుజ్జిలి

పట్టించుకున్న నాథుడే కరువు



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు ప్రారంభించలేదు. తూనికలు, కొలతల అధికారులు పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో తూకంలో భారీగా మోసాలు జరుగుతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులున్నాయి. దళారీ వ్యాపారులు రాజ్యమేలుతున్నారు.

– బద్రి రామారావు, రైతు, పెద్దసవళాపురం, సరుబుజ్జిలి

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి, నాయకులు

నరసన్నపేట: అసెంబ్లీలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అబద్ధాలు మాట్లాడటం ఆయనకు తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బుధవారం నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న విలేకర్లతో మాట్లాడారు. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని 50 నుంచి వంద పడకలకు పెంచడం, ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం, నలుగురు వైద్యుల స్థానంలో 21 మందిని నియమించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. వీటిని గుర్తించకుండా ఆస్పత్రి అభివృద్ధికి రూ.19 కోట్లే మంజూరయ్యాయని, గత ప్రభుత్వ కాలంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని అసెంబ్లీలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆస్పత్రిలో ప్రసూతి వార్డును ప్రత్యేకంగా తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మించడ జరిగిందన్నారు. టెక్నికల్ సమస్యల కారణంగా కొన్ని పనులు ఉండిపోయాయి తప్ప.. పూర్తిగా పనులు జరగలేదనడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాన తరువాత ఎమ్మెల్యే అనుయాయుల దందా పెరిగిందన్నారు. మద్యం షాపులు దక్కించుకొని.. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం ప్రజలందరికీ తెలుసని అన్నారు. గోపాలపెంట ఇసుక ర్యాంప్ ఎవరు నిర్వహిస్తున్నారో.. వంశధార నదిలో ఇసుకను ఎవరు లూటీ చేసి లక్షలు వెనకేసుకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, బగ్గు రమణయ్య, సతివాడ రామినాయుడు, దుల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందని ఉచిత గ్యాస్

- 15 రోజులు అవుతున్నా జమకాని సబ్సిడీ
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: సీఎం చంద్రబాబు మాయమాటలు చెబుతూ పరిపాలన కొనసాగిస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అర్హత ఉన్నప్పటికీ అందటం లేదన్నారు. గ్యాస్ సిలిండర్ బుక్‌చేసి ముందుగా లబ్ధిదారుడు డబ్బులు చెల్లిస్తే.. 48 గంటల్లో ఆవే డబ్బులు (సబ్సిడీ) లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు జమచేయటం జరుగుతుందని సీఎం చంద్రబాబు ప్రజలకు నమ్మించారన్నారు. గ్యాస్ తీసుకుని 15 రోజులు అవుతున్నప్పటికీ చాలా మంది లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ కాలేదన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఇలాంటి బాధితులు సగం కంటే ఎక్కువ మంది ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి నాయకుల చేస్తున్న ఇసుక దోపిడీకి, అధికారం వినియోగించుకుని చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై తప్పుడు కేసులు పెట్టించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవందరావు ప్రోత్సాహంతో నియోజకవర్గంలోని నివగాం వంతెన వద్ద నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతుందన్నారు. వంతెనకు సమీపంలోనే యంత్రాల ద్వారా ఇసుక తరలిస్తున్నా పట్టించుకునేవారు ఎవరూ లేరన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై రోజు రోజుకూ అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ధర్నా విజయవంతం చేయండి


కరపత్రాలు పంచుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాచలం

ఎల్.ఎన్.పేట: కేంద్ర ప్రభుత్వ విధానాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఇందుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలను చేపతామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పోరాట కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జరిగే ర్యాలీ, ధర్నా కార్యక్రమాల్లో అన్ని వర్గాలకు చెందినవారు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నూతన బోధనా పద్ధతులు అమలుచేయాలి

హిరమండలం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకుని నూతన బోధనా పద్ధతులు అమలు చేయాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు డైరీ, పాఠ్య ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. తరగతి గదిలో టీఎల్ఎంను వినియోగించి బోధన చేయాలన్నారు. అపార్ ప్రక్రియ సత్వరమే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల నుంచి హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం అన్ని మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాలలో ఘనంగా నిర్వహించారు. వారం రోజులపాటు విద్యార్థులకు, పాఠకులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. చివరి రోజు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తూరు: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు


మెళియాపుట్టి: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు


హిరమండలం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ హనుమంతురావు


పాతపట్నం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు


సారవకోట: బహుమతులు పొందిన విద్యార్థులతో మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం


జలుమూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు


ఆమదాలవలస: విద్యార్థులకు బహుమతులు, భగవద్గీతను అందజేస్తున్న ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు


బూర్జ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, తదితరులు

క్లుప్తంగా

ఏఐవైఎఫ్ మహా సభలు జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి యుగంధర్

సరుబుజ్జిలి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభలు జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు యువజన హక్కులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధన కోసం సభలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఆమదాలవలస నియోజకవర్గం నాయకులు సింహాచలం, ధర్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తూరు ఎస్ఐ బదిలీ

కొత్తూరు: స్థానిక ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.ఎ.అహ్మద్‌కు ఇంటిలిజెన్స్ విభాగానికి బదిలీ అయినట్లు కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు బుధవారం తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఎస్ఐకు సీఐ, సిబ్బంది సత్కరించారు. కొత్తూరు ఎస్ఐ బాధ్యతలను హిరమండలం ఎస్ఐకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


హిమసాగర్, పీఆర్ జేఈ

ఎల్.ఎన్.పేట: మండలం పీఆర్ (పంచాయతీరాజ్ శాఖ) జేఈగా బి.హిమసాగర్ బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ పి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పీఆర్ జేఈగా హిరమండలం మండలానికి చెందిన ఎస్.భాస్కరరావు ఇంతవరకు అదనపు బాధ్యతలు నిర్వహించారు. హిమసాగర్ కంచిలి మండలం నుంచి ఎల్.ఎన్.పేటకు బదిలీపై వచ్చారు.

ముమ్మరంగా రైల్వే ట్రాక్ పనులు


రైల్వే ట్రాక్ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: పర్లాకిమిడి నుంచి నౌపడ వరకు రైల్వే ట్రాక్ పనులు బుధవారం చేపట్టారు. స్పీడ్ ట్రాక్ పనులను రైల్వే అధికారుల ఆధ్వర్యంలో గంగువాడ వద్ద నిర్వహించారు. పర్లాకిమిడి నుంచి నౌపడకు ఈ మార్గంలో రైలు 50 కిలో మీటర్ల స్పీడ్ ఉండేది. ప్రస్తుతం ఈ పనులు పూర్తయితే రైలు స్పీడ్ 75 కిలో మీటర్లకు పెరుగుతుందని రైల్వే అధికారులు తెలియజేశారు.

తాగునీటి సరఫరాకు చర్యలు


పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న జేఈ ఉదయ్‌భాస్కర్, నారాయణమూర్తి

పాతపట్నం: స్థానిక బాలాజీనగర్-2లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.ఉదయ్‌భాస్కర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణమూర్తి ఈ నెల 18వ తేదీన తాగునీరు అందడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం బాలాజీనగర్-2ను నారాయణమూర్తితో కలిసి జేఈ సందర్శించారు. జేఈ మాట్లాడుతూ తాగునీటి పైప్‌లైన్ ఎత్తులో (కొండపై) ఉందన్నారు. తాగునీటికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కాలనీ వాసులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న సీఐ రామారావు

పాతపట్నం: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం సీఐ వి.రామారావు సూచించారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ అంజనేయులు, డైరెక్టర్ ఎస్.మధుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశు గణన పరిశీలన

సారవకోట: పశు గణనకు రైతులు సహకరించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.లోకనాథం కోరారు. బుధవారం మండలంలోని సవరడ్డపనస గ్రామంలో పశు గణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన జరుగుతుందన్నారు. పశు గణన చేసేందుకు వచ్చిన సిబ్బందికి పూర్తి సమాచారం అందించాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా!



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస సమీపంలోనిది. మండలంలోని మసానపుట్టి, అడ్డూరిపేట, సోమిదివలస, అనంతగిరి, జంబాడ గిరిజన ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా అటవీ కలప తరలిపోతుంది. దీనిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నరికిన కలప వంశధార అవతలి ప్రాంతాలైన కొమనాపల్లి, చల్లపేట, అచ్చుతాపురం, బుడితి, తిలారు, నారాయణవలస సంత ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

బోరు బాగుచేయరూ..



నరసన్నపేటలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న మంచినీటి బోరు అలంకారానికే పరిమితమైంది. మరమ్మతులకు గురై సుమారు 3 నెలలు కావస్తున్నా. అటు పంచాయతీ అధికారులు.. ఇటు ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోవడం లేదు. రోగులు, రోగుల బంధువులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. బోరును బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

– నరసన్నపేట

పంటల బీమాపై అవగాహన



రబీ సీజన్‌లో సాగుచేసిన రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని హిరమండలం మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ (పాడలి గ్రామం)లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వేసిన ఎకరా వరి పంటకు రూ.168, మినుము-రూ.38, శనగ-రూ.56, వేరుశనగ-రూ.60 చొప్పున డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

– హిరమండలం

శిథిలం..



సరుబుజ్జిలి మండలం యరగాం-పురుషోత్తపురం హైలెవల్ చానల్ గట్టు పూర్తిగా శిథిలావస్థకు చేరకుంది. ఈ చానల్ పరిధి సుమారు 14 కిలో మీటర్లు మేర విస్తరించగా.. ఆయకట్టు 7 వేల ఎకరాలు ఉంది. కాలువలో సాగునీరు ప్రవహించే సమయంలో ప్రమాదస్థితిని తలపిస్తుంది. అధికారులు స్పంచింది కాలువ గట్టుకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

ఆయుష్ వైద్య సేవలపై అవగాహన


అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, ఆశ కార్యకర్తలు

నరసన్నపేట: ఆయుర్వేద వైద్య సేవలను గృహ వైద్యం పేరిట అనేక మందికి అందించడం జరుగుతుందని మాకివలస ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ వైద్యాధికారి వి.సీతామహాలక్ష్మి అన్నారు. మండలం మాకివలస పీహెచ్‌సీ పరిధిలోని ఆశ వర్కర్లకు బుధవారం ఆయుర్వేదిక్ వైద్య సేవలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యం ఉందన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కల్పన యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాకివలస పీహెచ్‌సీ వైద్యులు శిరీష, విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైదలాపురంలో..

పాతపట్నం: ఆయుష్ వైద్య సేవలపై అవగహన అవసరమని తెంబూరు ఆయుష్ వైద్యశాల వైద్యురాలు ఎస్.ఉమాగౌరీ అన్నారు. బుధవారం మండలంలోని బైదలాపురం పీహెచ్‌సీలో జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు ఆయుష్ వైద్య సేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ ఆయుష్ వైద్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. బైదలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు జి.సదాశివ, యోగ శిక్షకుడు పి.మహేష్, డి.దివ్య, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి పల్లకీ సేవ

జలుమూరు: సత్యసాయి బాబా జన్మదినం పురస్కరించుకుని కొమనాపల్లిలో పల్లకీ సేవ, తిరువీధి ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు సాత్యసాయి సేవ సమితి ప్రతినిధులు ప్రసంగించారు. జిల్లా సత్యసాయి ఆధ్యాత్మిక సమన్వయకర్త సకలాభక్తుల అనాధగుప్త, పైడివెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు పురస్కరించుకుని యువజన దినోత్సవాన్ని జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ బి.సాయికృష్ణ, యూత్ జోనల్ కో ఆర్డినేటర్ పవన్ నేతృత్వంలో నిర్వహించారు. అక్కులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అక్కులపేట, వేణమ్మపేట గ్రామాల్లో సాయి నామస్మరణాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సత్య సాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సమితి యూత్ కో ఆర్డినేటర్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మెట్టూరులో సత్యసాయిబాబా జన్మదినం వేడుకలు నిర్వహించారు. బాబా చిత్రపటానికి తీరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

ఆర్థికసాయం

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన సంతోష్ బిశ్వాల్ అనే యువకుడు ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి పాతపట్నం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. సంతోష్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వట్టికుళ్ల చక్రి తదితరులు ఉన్నారు.